కన్నుల వెలుగు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

ఆటం బాంబులూ, ఏరోప్లేన్లూ, రాకెట్లూ, స్పుత్నిక్లూ—వింత శబ్దాలతో గగ్గోలుగావుంది వాతావరణం .....

దీపావళి రోజున తెల్లవారకమునుపే అభ్యంగనస్నానం చేసి విజయకుమార్ మేడమీద గదిలోకూర్చుని డిటెక్టివ్ నవల చదువుతున్నాడు. ఆఫీసుకాగితాలు, స్నేహితులు, భార్య ధర్మవేణి, డిటెక్టివ్ నవలలు— రోజంతా ఇలా ఏదోవిధంగా మనస్సుని క్షణం ఊరుకోనివ్వకుండా, అంటే అది ఏకాంతంగా వుండే అవకాశంలేకుండా, కాలంగడపటం అలవాటు చేసుకుంటున్నాడు విజయకుమార్. ఏకాంతంగా వుండటమంటే ఆలోచించటం; ఆలోచిస్తే, అసంతృప్తి, హృదయంలో బాధ, గుర్తుకు తెచ్చుకోవటమే. అందువల్ల ఆలోచనకు అవకాశంలేకుండా మనస్సుని ఏదో వ్యాసంగంలో, ఒక పరుగులో ఉంచుతున్నాడు. డిటెక్టివ్ నవలలు తప్ప ఇంకోరకం పుస్తకాలైతే అవీ ఆలోచనను ప్రేరేపిస్తాయని అతని భయం....

ధర్మవేణి పళ్లెంలో ఫలహారమూ, పాట్‌తో కాఫీ పట్టుకొచ్చింది. పుస్తకం ఒకప్రక్కన పెడుతూ "నువ్వు తీసుకున్నావా?" అన్నాడు విజయ్.

"మీరు కానివ్వండి"

"నువ్వూతీసుకో ఇక్కడే .... నాకెందుకిదంతా ? కాఫీ చాలు." విజయ్ కాఫీపాట్‌వైపు చేయిచాస్తుంటే, ధర్మవేణి తనే పాట్ తీసుకొని కప్పులో కాఫీపోసింది.

"అదేమిటి ఈ చీరకట్టుకున్నావ్ ? ఇవాళ్టికంటూ కొన్నది, ఎప్పుడు— సాయంత్రం— కట్టుకుంటావా ?"

"ఏది కట్టుకుంటే ఏం ? నాకిదే బాగుంది."

"ఇది ఉగాదికి కొన్నదికదూ !"

"మీకు జ్ఞాపకాలు బాగా ఉంటాయి."

"ఉండవ్‌మరి ! ఒక్కొక్కసారి ఒక మరుపురాని రసవత్తర ఘట్టం జరుగుతూంటే !"

"మీరు నన్నేమీ అనక్కరలేదు, పండుగపూట."

"సరే, వెళ్లి దీపావళికోసం కొన్నచీర దీపావళినాడుకట్టుకో, బాగుంటుంది."

"దీనిక్కూడా మీ ఆర్డరేనేమిటి ? నాకది బాగులేదు"

సగం త్రాగిన కాఫీకప్పు ట్రేలో పెట్టివేసి ఆశ్చర్యంగా చూశాడు విజయ్ భార్యవైపు.

"ఎందుకని ? గంటలు గంటలు నువ్విష్టపడి సెలెక్టు చేసుకొన్నదేగా."

"నా సెలెక్షనేమిటీ ? మీ సెలెక్షనయితే ! నాకా వూదా రంగుదే బాగుండేది."

తిరుగుమాటలేకుండా, పెదవి కొరుక్కొంటూ డిటెక్టివ్ నవలనిమళ్లీ చేతపుచ్చుకున్నాడు విజయ్. షాపులో గంధపు రంగు మైసూరు సిల్కుచీరా ? వూదారంగు బిన్నీ సిల్కుచీరా ? అన్న తర్కం వచ్చేటప్పటికి ధర్మవేణి భర్తనే నిర్ణయించమన్నది. విజయ్ విధిలేక తన అభిప్రాయంచెప్పాడు. వెంటనే ధర్మవేణి మాట్లాడకుండా ఆచీర తీసుకొన్నది. ఇప్పుడు అదితనకు బాగులేదట !

"కాఫీ సాంతం త్రాగేసి చదువుకోండి" అన్నది ధర్మవేణి.

"నీకో నమస్కారం....నువ్వుమాత్రం జన్మజన్మాలకూ భార్యగా నా సెలెక్షన్‌కావద్దూ, కాలేవు ! ఇక దయచెయ్యి...'

ధర్మవేణి నవ్వింది.... "ఆఁ !.... మీరువేసే ఆర్డర్లకు యంత్రాలుకూడా ఎదురు తిరుగుతాయి ! లేకపోతే ఏమిటండీ? ఎప్పటికేది ఇష్టమొస్తే ఆ చీరకట్టుకుంటారు గాని అన్నింటికీ ఒకటైంటేబిల్, రూల్సు, ఆర్డర్సు అంటే ఎవరువింటారు?

విజయ్ పుస్తకంమీదనుంచి తలత్రిప్పకుండానే వోరగా ఆమెనిచూస్తూ "పోనీ నన్ను తృప్తిపరచటానికి కనీసం ఒక్కసారైనా నేను చెప్పినట్లు ఎందుకు చెయ్యకూడదు ?" అన్నాడు.

"ఎందుకు వినలేదు, వింటూనేవున్నా.... కాఫీ త్రాగేయ్యండి." అని ధర్మవేణి విసవిసానడిచి వెళ్లిపోయింది.

తనమాట ప్రకారమే ధర్మవేణి చీరమార్చుకుని వస్తుందనే నమ్మకంతో, కాఫీపూర్తిచేసి ఆమెకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు విజయ్. కాని ఆమె తిరిగిరాలేదు. సుమారు ఒక గంటగడిచినతర్వాత విజయ్ దుస్తులువేసుకుని, మేడదిగివచ్చి స్నేహితునింటికి వెళ్లటానికి కారుకోసంచూస్తే కారులేదు. ధర్మవేణి కారులో తన స్నేహితురాలిఇంటికి వెళ్లిపోయిందని తెలిసింది. వంటఇంటిదాకా వెళ్లాడు. తల్లి వంటవాడికి సలహాలు ఇస్తూ సాయంచేస్తూవుంది.

"ధర్మ ఎక్కడికి వెళ్లింది ?"

"రుక్మిణి రమ్మన్నదని వెళ్లింది"

"ఏ రంగుచీర కట్టుకొన్నది ?"

"ఎందుకురా అడుగుతున్నావ్ ? ఏదికట్టుకున్నా మహాలక్ష్మిలా అందంగానే వుంటుంది. కనకాంబరంరంగు కాబోలు."

విజయ్ సైకిలువేసుకొని స్నేహితుని ఇంటికివెళ్లాడు

భోజనంవేళకు తిరిగివచ్చాడు విజయ్, కాని ధర్మవేణి రాలేదు. రుక్మిణి ఇంట్లోనే భోంచేస్తున్నానని కబురుపెట్టింది. విజయ్ మనస్సుబాగా వికలమైపోయింది. డిటెక్టివ్ నవల అతని ఆలోచనల్ని అరికట్టలేకపోయింది....

రెండేళ్లక్రితమే విజయ్‌వివాహం చేసుకున్నాడు. చదువు పూర్తయినతర్వాత మూడేళ్లు కాలేజి లెక్చరరుచేసి, తర్వాత ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసరుగా సెలెక్టు అయ్యాడు. చాలాకాలం వివాహం చేసుకోకుండా భీష్మించుకుని కూర్చున్నాడు విజయ్. అది ఒక విధంగా తండ్రిమీద, అన్నగార్లమీద, మేనమామమీదా కోపం! కాని హఠాత్తుగా తండ్రిపోవటంతో, అందరికంటె చిన్నవాడైన విజయ్ దగ్గరేవుంటూ, తల్లి క్రమంగా అతణ్ణి వివాహానికి సుముఖునిగా చేసింది. మంచి సంబంధాలకి కొరతలేదు. సంప్రదాయం సంపత్తూచూచి తల్లే ఎన్నికచేసింది ధర్మవేణిని. విజయ్ కట్నం విషయంలో చాలనిక్కచ్చిగా వున్నాడు.... దానిక్కారణం మధ్యకాలంలో అతని మనోవైఖరిలో వచ్చినమార్పు : విద్యాదశలోనూ, లెక్చరరుగానూ అతను ఆదర్శవాదే. లెక్చరరు చేసిన మొదటిసంవత్సరం అంతంలో వివాహం చేసుకుంటానన్నాడు విజయ్. కానిఅతను ఇష్టపడిన అమ్మాయి కులంవేరుకావటంతో తండ్రీ, అన్నలూ, మేనమామలు ఎవరూ అంగీకరించలేదు. తర్వాత వివాహమే అక్కర్లేదంటూ వాళ్లుతెచ్చిన సంబంధాల్ని తిరగొట్టుతూ వచ్చాడు విజయ్.

ధర్మవేణి అరవిచ్చిన గులాబిలా వుంటుంది. ఆమెకు బి. ఏ. చదువు పూర్తయిన వేసవిలోనే పెళ్లి జరిగింది. తల్లిదండ్రుల గారాబం కారణం కాబోలు ధర్మవేణిలో గులాబీ సౌందర్యంతోపాటు గులాబీ ముల్లులా గుచ్చుకునే గుణంకూడా నిశితంగా వుంది. అందుకే విజయ్‌కు అనిపిస్తుంది : తను ఆమెను అర్థం చేసుకోగలడు. నెమ్మదిగా ఆలోచిస్తూనే వేచివుండగలడు, కానీ ఎంతకాలం ఈ వేచివుండటం, సర్దుకుపోవటం ? ఆమెకూ తనకూ మధ్యఒక వంతెన తనే పొడుగూనా నిర్మించుకురావాలి అంటే ఎలా సాధ్యం ! పోనీ అలా చెయ్యటానికే సిద్ధపడి రెండేళ్లనుంచీ ప్రయత్నిస్తూవున్నా, ఎప్పటికప్పుడు తను దగ్గరకు వెళ్లేకొద్దీ ఆమె దూరంజరుగుతూనేవుంది !.... చివరికి దొకరకం దాగుడు మూతలాటలా తయారైంది. ఏ ఆటఅయినా సరదాగా వుండటానికి కాలనిర్ణయంవుంది, వూరికే పొడిగిస్తే సరదాలేక పోవటమేకాదు, అంతకంటె యాతనకూడ వేరేవుండదు !....

భార్య అంటే ఎలావుండాలి ? భర్తమనస్సుకు నిలువుటద్దంలా వుండాలి ! పోయిన జనవరికి ఇద్దరూ మహాబలిపురం వెళ్లారు, అక్కడ ధర్మవేణి నరకంచేసేసింది ! భార్య, భర్త వూహించే కల్పనకు గోపురాలు కల్పిస్తూ వుండాలి, అలాకాకపోతే కనీసం చూచి ఆనందించే గుణమైనా ఆమెలో వుండాలి, అవి కూలదోస్తూవుంటే ఏంచేస్తాడు భర్త ? పోనీ తనే ఏదైనా కల్పించి, తనవూహాలో భర్తను కలుపుకోవటమే ఆమెవ్యక్తిత్వం విశిష్టతాఅంటే ధర్మవేణి విషయంలో అదీ నిజంకాదు. 'నంది' అంటే 'పంది' అనడమే ఏకైక లక్ష్యంగావుండేవ్యక్తి నేంచేసుకోవాలి ?.....

ధర్మవేణి ఎప్పుడు తిరిగి వచ్చిందో, భోజనం తర్వాత ఆలోచిస్తూ కునుకుతీసిన విజయ్ నిద్ర లేచేటప్పటికి ఎదుటే సాక్షాత్కరించింది. "మీకోసం ఎవరో వచ్చారు లేచి మొహం కడుక్కోండి. టీ కూడా సిద్ధంగా ఉంది ...." విజయ్ లేచి క్రిందికి వెళ్లాడు. ఏమీ మాట్లాడకుండా. మాటలతో లాభంలేదు. మానసికంగా ఇన్నాళ్లూ పడుతున్న బాధనీ, తాపత్రయాన్నీ ఇవాళ్టితో అంతంచేసి, నిర్లిప్తంగా ఉండాలనుకున్నాడు. ఇకనుంచీ !

వచ్చిన వ్యక్తి బాంక్ ఏజంట్ గోపాలరావు. కొంతసేపు మాట్లాడిన తర్వాత అతను క్లబ్బుకు వెళ్దామంటే విజయ్ బయల్దేరాడు. డ్రెస్ చేసుకోవడానికి పైకి వెడితే "సాయంత్రం పెందలకడే రండి" అని పురమాయించింది ధర్మవేణి. విజయ్ ముక్తసరిగా వూరుకున్నాడు. "కోపం వచ్చిందా ? ఇవాళ సాయంత్రం దీపాలు వెలిగించి బాణసంచా కాల్చాలి. రుక్మిణి నేనూ బజారు వెళ్లి చెరొక పదిహేను రూపాయల సామగ్రీ పట్టుకొచ్చాం .... మీరు భయంలేకుండా కాలుస్తారూ ? మీకోసం కొన్ని తెచ్చాను. ప్రత్యేకంగా, చూద్దురుగాని ....." ధర్మవేణి అలా ఉత్సాహంగా మాట్లాడేస్తూ ఉంటే ఎనిమిదేళ్ల పసిపిల్లలా కనిపించింది విజయ్‌కి ..... కోపం పోయి "సిల్లీగర్ల్!" అనుకున్నాడు మనస్సులో నవ్వుకుంటూ. "ఏం వస్తారుకదూ !" అని ఆమె మళ్లీ అడిగినప్పుడు "సరేలే" అనేసి బయటపడ్డాడు విజయ్. కాని కారులో కూర్చోగానే "ధర్మ సిల్లీ గర్ల్ అయితే కావచ్చు కాని, భార్యగా ఎలా వేగటం ? నాకు మాత్రం సుతరామూ పనికిరాదు, నాట్ మై ఐడియా ఆఫ్ ఎవైఫ్ !" అనుకున్నాడు....

ఆ సాయంత్రం చీకటి పడినాక విజయ్ క్లబ్బులో పేకాడుతూ ఉండగా ప్యూన్ పరుగెట్టుకొచ్చాడు : "బాబూ అమ్మగారికి ప్రమాదం జరిగింది .... చిచ్చుబుడ్లు కాలుస్తుంటే ముఖం కాలింది, కళ్లల్లోనూ పడ్డాయి నిప్పురవ్వలు .... మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు ....." అని వార్త తెచ్చాడు.

విజయ్ ఇల్లు చేరుకునేప్పటికి అతని తల్లి ధర్మవేణిని ఒళ్లోపడుకోబెట్టుకువి ఉపచారాలు చేస్తోంది. ధర్మవేణి కళ్లు గట్టిగా మూసుకుని మూలుగుతోంది. నుదుటిమీదు ఒకటి, రెండు బొబ్బలు తేలాయి. ముంగురులు కూడా కొంతభాగం కాలాయి. కాని అసలు ప్రమాదం నిప్పురవ్వల కళ్లల్లో దూరటమే ! కళ్లల్లో మంటా, బాధా వోర్చుకోలేక పోతోంది ధర్మవేణి ......

కారులో వెంటనే హాస్పిటలుకు వెళ్లారు.

హాస్పిటల్లో నాలుగు నెలల క్రితమే నేత్రచికిత్స కోసం ఒక ప్రత్యేక శాఖ తెరిచారు. హాస్పిటల్ చీఫ్ సర్జను బలరాం నేత్రవైద్యంలో నిపుణు డంటారు. ఆయనకు ఫోను చేస్తే ఆయన వూళ్లో లేరని తెలిసింది. ఇంతలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌కు కబురు వెళ్లింది. ఆమె నెల క్రితమే క్రొత్తగా వచ్చిందట. ఈమధ్య నేత్రచికిత్స ఆమే చేస్తూం

దట. ఆమె అమెరికాలో ఒక ఏడాది ట్రెయినింగ్ కూడా అయిందట. సర్జను కేమాత్రమూ తీసిపోదు అని చెబుతున్నారు హాస్పిటలువాళ్లు. ఇంతమాత్రమైనా ఒకరు సమయానికి ఉండటం ఏదో అదృష్టమే అనిపించింది విజయ్‌కి.

డాక్టరు వచ్చింది ..... సుమారు పదేళ్ల క్రితం ఇంటరులో తన విద్యార్థినిగా చదువుకున్న ప్రేమలత !—డాక్టర్ ప్రేమలత !

వచ్చీ రాగానే విజయ్‌వైపు చూచి : "ఏదీ ఆమె ?" అంటూ ధర్మవేణిని కూర్చున్నపాటున్నే టార్చితో గాయాలు పరీక్షించి, చకచకా టేబిల్ వగైరా సిద్ధంచేయించి, చికిత్స ప్రారంభించింది ప్రేమలత.

ప్రేమలత ఎప్పుడు డాక్టరైంది ? ఎప్పుడు అమెరికా వెళ్లింది ? ఎప్పుడు ఈ వూరు వచ్చింది ? ఎంతలో జీవితం ఎలా మారిపోయింది ! అంతా ఎనిమిదేళ్లలో జరిగిన ఒక విచిత్రంగా అనిపిస్తోంది విజయ్‌కి. ఒకప్రక్క దూరంగా నిల్చుండి మౌనంగా గమనిస్తున్నాడు ఆమెని ..... అసలు ఆమె తనను గుర్తించిందో లేదో అని కూడా సందేహం కలిగింది .....

ధర్మవేణికి కళ్లమీదుగా కట్టు .... చికిత్స ముగిసింది... ప్రేమలత ఏం మాట్లాడుతుందోనని ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాడు విజయ్.

"మీరు ఆమెను ఇంటికే తీసుకువెళ్లండి. అవసరమైతే నాకు కబురు చెయ్యండి. రేపు సాయంత్రందాకా కట్టు విప్పగూడదు .... వెలుతురు ఎక్కువగా లేని గదిలోనే ఉండమనండి .... ఐ యామ్ వెరీ సారీ ఫర్ యూ" అన్నది ప్రేమలత.

ధర్మవేణిని కారులో కూర్చోబెట్టడానికి తీసుకువెళ్లారు.

"దృష్టి పోయే ప్రమాదం ఉందంటారా ?"

"ఇప్పుడేం చెప్పటానికీ వీల్లేదు. బర్న్స్ ఎక్కువగానే ఉన్నట్లున్నాయి .... ట్రీట్‌మెంట్ తర్వాతకానీ తెలీదు 'కార్నియా' ఎలా అఫెక్ట్ అయిందో .... అఫెక్ట్ కాదనే ఆశిద్దాం ..... ఇది రావలసిన ఆపద కాదు !"

"థాంక్స్ .... నా దురదృష్టం .... "

"మీరు అధైర్యపడకండి .... భగవంతుడున్నాడు ..."

ప్రేమలత వెళ్లిపోయింది. విజయ్ కారు స్టార్ట్ చేశాడు.

ప్రేమలత అమెరికా వెళ్లినా భగవంతుణ్ణి మరిచిపోలేదు. తన నెవరైందీ గుర్తించిందా ? బహుశా జ్ఞాపకం వచ్చినా, ప్రస్తుతం గుర్తించటానికి ఇష్టంలేదు కాబోలు!

మరునటిరోజు సాయంత్రం విజయ్ డాక్టరు ప్రేమలతకి ఫోను చేశాడు! "ధర్మవేణి ఆస్పత్రికి రాలేనంటోంది ..... మీరు శ్రమ అనుకోకుంటే ఒకసారి వచ్చి చూడండి .... కారు పంపిస్తున్నాను .... థాంక్స్ !"

ప్రేమలత వచ్చింది. ద్వారం దగ్గరికి వెళ్లి పలకరించాడు విజయ్. "నే నెవరో గుర్తు వచ్చానా డాక్టర్ ?"

ప్రేమలత నొసలూ కళ్లూ, ఏదో సమస్య నెదుర్కొనేలా ఒక్క క్షణం చలించినా, వెంటనే ఆమె పెదవుల మీద చిరునవ్వు కనిపించింది. "ఆఁ .... మా లెక్చరరుగారు కదూ ! నిన్ననే గుర్తించాను. మొదట ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసరంటే ఎవరో అనుకున్నాను. తీరా చూస్తే మీరు ! .... సరే, ఆమె ఎక్కడున్నారు ?" ఆమె కంఠం నిండుగా ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తంచేస్తూ, స్నేహపూర్వకంగా ఉండటం గమనించాడు విజయ్.

ఆమెని మేడమీదికి తీసుకువెళ్లాడు.

కట్టు విప్పి మందు వేసిన తర్వాత, ప్రేమలతను గూర్చి ధర్మవేణికి పరిచయం చేశాడు విజయ్.

"అలాగా .... మీ రెలా ఉంటారో చూసేందుకు వీల్లేదు కద ! మీ ప్రేళ్లు చాల సున్నితంగా పనిచేస్తాయి అని మాత్రం చెప్పగలను ..... " అన్నది ధర్మవేణి.

ప్రేమలత విజయ్‌వైపు చూచి చిరునవ్వు నవ్వుతూ ధర్మవేణి చేతిని తన చేతిలోకి తీసుకొన్నది. "తొందరలోనే చూద్దురుగాని నన్ను ! .... అధైర్యపడి మనస్సు పాడుచేసుకోకండి" అన్నది.

"ఆమాట వారితో చెప్పండి" అన్నది ధర్మవేణి.

ప్రేమలత వెళ్లిన తర్వాత పరధ్యానంగా మాట్లాడకుండా ధర్మవేణి దగ్గరే కూర్చుండిపోయాడు విజయ్. సూర్యాస్తమయం పసిడి వర్ణంతో కనిపిస్తోంది కిటికీలో నుంచి .....

ప్రేమలత విచ్చిన సంపెంగలా ఉంది. అప్పటికీ ఇప్పటికీ ఆమె సౌందర్యం రేకులు విచ్చి పరిపూర్ణత్వం పొందింది. ఒకనాడు ప్రేమలతా తనూ ప్రేమించుకున్నారు. కాని వివాహానికి సంఘం అడ్డం వచ్చింది. తల్లిదండ్రులూ, బంధువులూ—సంఘంలో ముఖ్యమైనవాళ్లు వీళ్లేకద ! ఆరోజు తన జీవితంలో ఆనందాన్ని, అమృతకలశాన్ని తనకు చెందకుండా చెయ్యటానికి తయారై, ఈరోజు ఎవరూ ఆ ఫలితానికి బాధ్యత వహించరేం ? ఇది తన దురదృష్టం, కర్మ అంటారు ! ఎవరికి అర్థమవుతుంది తన హృదయవేదన ? ఈ అమ్మాయిని తన జీవితానికి భాగస్వామినిగా చెయ్యటంతో బాధ్యత తీరిందనుకున్నారు గాని, మనస్తత్వాలు సరిపడక, అంతంతమాత్రంగానే ఉన్న దాంపత్యంలో 'అంధత్వం' కూడా దాపురించి సర్వమూ శూన్యమవుతున్న ఈ పరిస్థితి వాళ్లకు కనీసం అర్థమవుతుందా ? .... ప్రేమలత తన జీవితాన్ని గూర్చి ఏం నిర్ణయం చేసుకున్నట్లు ? ఇంతవరకూ చదువూ, ఉద్యోగమూ, సంపాదనా—ఇకముందు ఆమె జీవితానికి లక్ష్యం ఏమిటో ? ప్రేమలత మూడు తరాల క్రింద ఎప్పుడో వృత్తి చేసిన కళావంతుల కులంలో జన్మించటమే ఆమె చేసిన నేరమా? చదువూ, సంస్కారమూ, సౌందర్యమూ, గుణగణాలూ ఇవేమీ

లెక్కకు రాకపోయాయే ! సంఘాన్ని తిరస్కరించటానికే ఆనాడు తను సిద్ధపడ్డాడు. కానీ ప్రేమలత అందుకు సిద్ధంగా లేదు. ఎందుకో ఆమెకూ ధైర్యం చాలలేదు ! ఆమెలోని మంచి తనమే, సంఘానికి ఆమెని విధేయురాల్ని చేసిన బలహీనత కూడా అయింది ....

తల్లి మేడమెట్లెక్కి వచ్చి దీపం స్విచ్చి వేసేదాకా చీకట్లో అలానే కూర్చుండిపోయాడు విజయ్, తన దుర దృష్టాన్ని గూర్చి ఆలోచిస్తూ .... ధర్మవేణి నిశ్శబ్దంగా పడు కొని ఉంది .....

"అమ్మా ధర్మా, పెందలాడే భోంచేస్తే బావుంటుంది, లేస్తావా ?" అన్నది విజయ్ తల్లి.

"వద్దు అత్తయ్యా, ఆకలి లేదు ..... వారికి పెట్టు."

"ఇప్పుడు నాకేనా వచ్చింది తొందర !" అన్నాడు విజయ్.

నిశ్శబ్దంగా, మౌనంగా, క్షణం పూరుకుండే స్వభావం కాదు ధర్మవేణిది, అలాంటి వ్యక్తి ఇంతసేపూ మౌనంగా ఏమి ఆలోచిస్తూ ఉండిపోయిందో, ఈ ప్రమాదాన్ని గూర్చి ఆమె మనస్సు ఎంత వికలంగా ఉందో అని తోచింది విజయ్‌కి తటాలున ..... మృదువుగా అతను "ధర్మా, క్రిందికి వెళ్దాం పద, ఇద్దరూ భోంచేద్దాం కాని !" అన్నాడు.

"వద్దు. మీరు వెళ్లండి."

"పోనీ, ఇద్దరికీ భోజనం ఇక్కడికే తెప్పించే ఏర్పాటు చేస్తానులేరా" అన్నది తల్లి.

ఆమె మేడమెట్లు దిగి వెళ్లిపోగానే, ధర్మవేణి పిలి చింది : "ఏమండీ !"

"ఏం కావాలి ?"

"అన్నం స్పూన్‌తో మీరు పెట్టరా నాకు ?"

"అమ్మ ఏమనుకుంటుంది ? తను పెట్టటం నీకిష్టం లేనట్లు అర్థంచేసుకుని మనస్సులో కష్టపడదూ !"

ధర్మవేణి మాట్లాడలేదు.

భోజనం మేడమీదికి వచ్చింది.

"లేరా చేయి కడుక్కో" అన్నది తల్లి. ధర్మవేణి దగ్గరకు వెళ్లి "లే తల్లీ !" అన్నది.

"నాకు ఆకలి లేదు, ఈపూట మానేస్తాను అత్తయ్యా."

"ఎందుకా మొండితనం ? చెప్పినట్లు వినరాదూ !" అన్నాడు విజయ్ కోపంగా.

"ఇప్పుడే మన్నదని ? నీకెందుకు నువ్వూరుకో'! అన్నది తల్లి మందలిస్తూ.

"ఎవరికీ అక్కరలేని ఈ తిండి ఇక్కడికి తీసుకురావట మెందుకమ్మా ?" విజయ్ విసుక్కున్నాడు.

"నువ్వు తినకపోతే వాడూ తినడు, ఎవరికీ మనసు బాగుండటంలేదు ..... ఇలా అధైర్యపడటం దేనికి ? లెండ్రా, మనకు మంచి జరక్కపోదు ...." అన్నది తల్లి. ధర్మవేణి దగ్గరకు వెళ్లి లేవదీయబోయింది ఆమె. ధర్మవేణి వెక్కుతూ ఉంది. "ఏడవకమ్మా కళ్లు బాధ చేస్తయ్." ధర్మవేణి లేచి కూర్చుని "అత్తయ్యా, అన్నంవద్దు, పాలు తీసుకుంటాను" అన్నది.

విజయ్ తల్లి వంటవాణ్ణి కేకవేసింది.

"నాకూ పాలే తీసుకురమ్మను" అన్నాడు విజయ్.

ధర్మవేణి తల్లిదండ్రులు వచ్చారు. సర్జను బలరావ్‌ గారు వచ్చారు. డాక్టరు ప్రేమలతకు నేత్రచికిత్స బాగా తెలుసుననీ, అమెరికాలో డాకర్లు ఆమె ప్రతిభను గూర్చి మెచ్చుకుంటూ సర్టిఫికెట్లు ఇచ్చారనీ, అన్నారు బలరావ్‌గారు. ఆమెమీద తనకు మంచి నమ్మకం ఉందనీ, ఆమె చేస్తున్న దానికంటె వేరే చెయ్యవలసింది ప్రస్తుతమేమీ లేదనీ ఆయన చెప్పటంతో ధర్మవేణిని మద్రాసో, వైజాగో తీసుకువెళ్లే ఉద్దేశం తాత్కాలికంగా వదిలిపెట్టుకున్నారు.

ప్రేమలత రోజూ ఒక్కసారి వచ్చి వెడుతోంది. ఇంట్లో అందరికీ ఆమెమీద గౌరవం ఏర్పడ్డది. విజయ్‌తో ఆమె స్నేహపూర్వకంగా మాట్లాడుతోంది కాని, ఆమె మన స్సేమిటో అతనికి అవగాహన కావటంలేదు. ఆమెను గూర్చిన ఉత్కంఠ నానాటికీ ఎక్కువైపోతోంది అతనికి ...... ఒకనాడు తన్ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానన్న ప్రేమలత, జీవితంలో ఇంకే లక్ష్యమూ ప్రస్తుతం లేనట్లే కనిపిస్తున్న ప్రేమలత, ఎందుకని అసూయో, ఆసక్తో, నిస్పృహో, కోపమో, ఏదో ఒక భావం చూపటంలేదు ? ఈ స్నేహం, నిర్లిప్తతా ఏమిటి ?

ఆ రోజు ఆదివారం. ధర్మవేణికి ప్రమాదంజరిగి ఎనిమి దవరోజు. ఇంకా కట్టు కడుతూనేవుంది ప్రేమలత. ఆరోజు ఉదయాన్నే విజయ్ ప్రేమలత క్వార్టర్స్‌కి బయలుదేరాడు....

"ప్రేమా, నా జీవితంయిలా దుర్భరమై పోతుందనుకో లేదు...."

"ఒక్క ప్రమాదానికే ఇలా అధైర్య పడతారేమిటి మీరు?

"అధైర్యం అంటావు, నీకేపాటి ధైర్యంవుందో చెప్పు.. ఒకనాడు నువ్వేంచేశావ్ ? మన వివాహానికి సంఘం అంగీకరించదు అని తెలుసుకోగానే, ప్రత్యుత్తరమైనా వ్రాయకుండా బంధం త్రెంచుకొనిపోయావు.... సంఘానికి దాసోహం అన్నావు.... ఎందు కని ? ఎన్నాళ్లనుంచో నేను అడగదలచుకున్న ప్రశ్న ఇది.... నువ్వెప్పటికైనా నాదానివేఅని సంవత్సరాలకొద్దీ వేచి ఉన్నాను. చివరకు మా అమ్మను తృప్తిపరచటానికి, ఇక ఏంచేస్తే ఏం, అని వివాహంచేసుకున్నాను. శాంతీ సౌఖ్యమూరెండూ లభించ లేదు.... ఇలా ఆదర్శాలు భగ్నమైన జీవితాన్ని దురదృష్టం పూర్తిగా చేజిక్కించుకున్న క్షణాన్నే నువ్వుమళ్లీ ఎందుకు కనిపిం చావ్ ? నా కింక జీవితంలో ఏమీలేదా ? చెప్పు, నువ్వు మారి పోయావా ?...."

ప్రేమలత కళ్లల్లో నీళ్లు తిరిగాయి....తలవంచుకొన్నది మాట్లాడకుండా....

"చెప్పు, నువ్వు నాదానివికావా ?"

ప్రేమలత కళ్ళుతుడుచుకుని, విజయ్‌వైపు చూస్తూ నిశ్చలమైన కంఠంతో అన్నది :

"అవునూ ! కాదూ !.... నేను మీదాన్నే అనుకోండి, ఇప్పుడు లాభమేమిటి ? నాకు ఆశ్చర్యం ఏమిటంటే, మీరు ఇన్నిఏళ్ల తర్వాతకూడా జీవితాన్ని అర్థంచేసుకోకుండా అమాయకంగా ఎలా వుండిపోయారాఅని ! ఇరవైఏళ్ల వయస్సులో మాట్లాడిన మాటలే ముప్ఫైవచ్చినా మాట్లాడుతున్నారు ! చూడండి అప్పుడు మీకర్థంకాకపోవచ్చు, కానీ ఇప్పటికీ అర్థంకాలేదా నేను ప్రత్యుత్తరం వ్రాయనికారణం ?.... 'మా తల్లిదండ్రుల కిష్టంలేదు, ఏంచెయ్యఃంటావు ప్రేమా ! నువ్వేంచెయ్యమన్నా చెయ్యటానికి సిద్ధమే !' అని వ్రాశారేనాకు, దానికి నేనెట్లా సమాధానం ఇవ్వగలను ? కొన్నినిర్ణయాలు ఎవరికివారే చేసుకునేవీ, బాధ్యత వహించవలసినవీ అనిమీకు తట్టటంలేదా ? మీరు చేసుకోవలసిన నిర్ణయం నామీదతోస్తే అదిన్యాయంగా నేను చెయ్యవలసిన నిర్ణయంకానప్పుడు, మరేం చేస్తాను ? మీకు నేనేనిజంగా కావాల్సివస్తే, ఆ ఉత్తరానికి ప్రత్యుత్తరం లేదుగనుక, సరాసరి నాదగ్గరకు వచ్చివేస్తారు, అలా నిర్ణయానికి వస్తారు, అనుకున్నాను. కాని తర్వాతమీకు నాసంగతే అక్కరలేకపోయిందే ! ఏమనుకోవాలినేను ? నామనస్సు ఎప్పటినుంచో మీకు తెలిసేవుందికదా ! అలాంటప్పుడు మీ జీవితంలో నేను అవసరమైన వస్తువునే అంటూ తెలిపేటందుకు మీరేంచేసినట్లు చెప్పండి ?.... ఎవరు సంఘానికి లొంగిపోయినవాళ్ళు ?"

విజయ్ ఆమెమాటల కడ్డువచ్చి : "నా ఊహలకూ, ఆశయాలకూ మెరుగులు దిద్దేదానివి, ఆ నిర్ణయంమాత్రం నీది కాదా అదీనువ్వే చేస్తావనుకున్నాను !" అన్నాడు.

"ఒకవైపు మీ తల్లిదండ్రులూ ఒకవైపు నేనూ అయినప్పుడు అదిమీకు మీరేతప్ప మరెవ్వరూ చెయ్యలేని నిర్ణయం. ఆలోచించండి.... అయినా మీరింత అర్భకులని మీకంటే చిన్నదాన్ని నాకెలా తెలుస్తుంది ?" అంటూ నవ్వేసింది ప్రేమలత. "మీ తల్లిగారిని చూస్తుంటే ఇప్పుడర్థమవుతోంది, ఆమె ప్రతీది ఏర్పాటుచేసిపెట్టుతూ మీకు స్వయంనిర్ణయ శక్తి లేకుండా తయారు చేసిందని !"

"ప్రేమా నువ్వెంత కఠినంగా మాట్లాడుతున్నావో తెలీదు నీకు !"

"తెలుసు— సంఘం, భగ్నజీవితం, దురదృష్టంలాంటి తెరలు ముందువేసుకూర్చున్నారేమిటా అనిపించి, నిజమేమిటో చెబుతున్నాను అంతే !.... ధర్మ ఏంచేస్తోంది ? ఇంత ఆపదలో ఆ అమ్మాయి ఎంతధైర్యంగా నిశ్చలంగావుందో మీకేమైనా అర్థమవుతోందా ?...."

విజయ్ తటాలునలేచి, "వెళ్తాను" అన్నాడు.

ప్రేమలత అతనిచెయ్యిపట్టుకుని : "ఉండండి, కాఫీ తీసుకుని వెళ్దరుగాని" అన్నది ప్రాధేయపడుతూ, విజయ్ కూర్చున్నాడు.

ప్రేమలత లోపలికివెళ్లి స్టవ్‌మీద నీళ్ళుపెట్టి తిరిగివచ్చి, జడవిప్పుకొని తలదువ్వుకుంటోంది.... విజయ్ ఆలోచనలో పడ్డాడు....

"నిన్నిప్పుడు వివాహంచేసుకుంటాను" అన్నాడు ఉన్నట్టుండి.

ప్రేమలత నవ్వింది. "మన ఉద్యోగాలుతీసేసి, తర్వాత మిమ్మల్నీ నన్నూ జైలుకు పంపిస్తారు"

"హిందూధర్మప్రకారం నేను నిన్ను చేసుకోవచ్చునే, ఈ చట్టానికి అర్థమేమిటి ? వ్యక్తుల నర్థంచేసుకోలేని వీళ్లనీ చట్టం ఎవరుచెయ్యమన్నారు ? ఉద్యోగం మానేసి పెళ్లి చేసుకుంటానునిన్ను శాస్త్రోక్తంగా...."

"మహా గొప్పపనిచేస్తారు !" అంటూ ప్రేమలత లోపలికివెళ్లింది కాఫీ తీసుకురావటానికి.

హిందూ వివాహాన్నిగూర్చి, హిందూధర్మాన్నిగూర్చి విజయ్ ఆలోచిస్తూనే ఉన్నాడు. తను ప్రేమలతను ఎందుకు వివాహంచేసుకోగూడదు ? ఇక్కడ సపత్నుల ఈర్ష్యాసూయలకు ప్రమేయంలేదే ! ఈమాటే ప్రేమలతతో అంటే : "ధర్మం ఎప్పటికీ ఒప్పుకోరు ! అది న్యాయంకాదు !" అన్నది.... అసలు వివాహమంటే ఏమిటి ? మనసివ్వటమే ప్రధానమైతే ప్రేమలతే తన భార్య. మంగళసూత్రం కట్టడమైతే ధర్మ తన భార్య. ఇందులో ఎవరిని కాదనటం ?

ఒకనాడు ధర్మవేణికి కట్టు విప్పి పరీక్ష చేసింది ప్రేమలత. "కంటిలో గాయాలు ఇంచుమించు మానిపోయినట్లే, కట్టు అవసరంలేదు" అన్నది. కాని ధర్మవేణికి చూపు మాత్రం రాలేదు ! ఇల్లంతా గొల్లుమన్నారు.

ఇక శాశ్వతంగా అంధత్వమేనా ?

మూడు నెలలు వ్యవధి యిచ్చి, వెలుగుని ప్రసారంచేసే గుణం కోల్పోయిన కార్నియాని ఆపరేట్ చేసి, కొత్త కార్నియాని గ్రాఫ్ట్ చేస్తే చూపు వస్తుందని సర్జన్ బలరావ్‌గారు అభిప్రాయ మిచ్చారు. తనే ఆపరేషన్ చేస్తానని కూడా ఆయన అన్నారు. ఇక అదొక్కటే ఆశ.

విజయ్‌కి ఏమీ తోచలేదు. ఆ సాయంత్రం క్లబ్బుకి వెళ్లకుండా ప్రేమలతను చూడటానికి వెళ్లాడు.

ప్రేమలత అభిప్రాయం అడిగాడు ఆపరేషన్ గూర్చి.

"ఆపరేషన్ చేస్తే చూపు రావటం నిజమే. తప్పకుండా వస్తుంది. కాని అది సున్నితమైన ఆపరేషన్. ఇక్కడ చేయించటం నా కిష్టంలేదు. బలరావ్‌గారు చెయ్యలేరు. వైజాగ్‌లో ప్రొఫెసరు పరమేశ్వరరావుగారిచేత చేయించండి..." అన్నదామె.

"నమ్మకమేమిటీ ?" అన్నాడు విజయ్ నిస్పృహగా.

ఆ నిస్పృహ జీవితం మీదే నిస్పృహగా వ్యక్తం అయింది.

"నాలో నమ్మకం ఉందా ?" అని ప్రశ్నించింది ప్రేమలత.

"ఆఁ" .

"అయితే ధర్మకు తప్పకుండా చూపు వస్తుంది ..... ధైర్యంగా ఉండండి."

విజయ్ వెళ్లటానికి లేచినవాడు ఆగాడు. ఏమిటో చెప్పబోయి, సందేహిస్తూ ఉన్నట్లు ఆమెవైపు చూశాడు. ఆమె అతనివైపు తదేకంగా చూస్తోంది. ధైర్యాన్ని, విశ్వాసాన్ని ప్రసాదిస్తూ కర్తవ్యాన్ని నిర్దేశిస్తోంది ఆమె చూపు.... అదొక వెలుగు !

"ప్రేమా ! నీ మంచితనాన్ని ఒక్కసారి ముద్దెట్టుకోవచ్చా ?" అన్నాడు, భక్తుడు దేవతని వరం కోరుకుంటున్నట్లుగా విజయ్.

ప్రేమలత ఒక్క క్షణం నిదానించి అతనికి దగ్గరగా వచ్చింది. ఆమెను హృదయానికి హత్తుకొని పెదవుల్ని ముద్దుపెట్టుకున్నాడు. ఆమె అతణ్ణి దూరంగా త్రోసివేసింది.

"ఊఁ .... మంచితనాన్ని కాదు, నన్నే ముద్దెట్టుకుంటున్నారే ! మిమ్మల్ని దగ్గరకు రానిస్తే ప్రమాదమే ! ఇక వెళ్లండి" అన్నదామె చిరుకోపంతో.

"నా జీవితానికి దారి చూపిస్తున్నావు...నీ సంగతేమిటి?"

"ఏముందీ, ఎందుకు డాక్టరయ్యానో ఆపని సాగుతూనే ఉంది కద !"

"నీకు మరేమీ అక్కరలేదా ? .... నువ్వెంత దగ్గరగా ఉన్నావో మళ్లీ అంత దూరంగానూ ఉన్నావనిపిస్తుంది.... నువ్వు నాకు అర్థంకావు .... కాని జీవితంలో నువ్వే నా తుది విశ్వాసం."

"మరి ప్రేమంటే ఏమనుకున్నారూ !" అని నవ్విందామె. "మనుష్యులు ఎంతదూరంలో ఉన్నా మనస్సులకి దూరమంటూ లేదే ! మీరు ధర్మని అర్థంచేసుకోండి, నేనూ అర్థమౌతాను !"

మూడు నెలలు గడుస్తున్నాయి. అంతలో తలవని తలంపుగా ప్రేమలతను వైజాగ్ బదిలీ చేశారు. ఇది శుభశూచకమనే భావించారు విజయ్ ఇంట్లో అందరూ. వైజాగ్ వెళ్లిన ప్రేమలత ఉత్తరం వ్రాసింది కూడా. తను పరమేశ్వరరావుగారితో సంప్రదించినట్లూ, ధర్మవేణిని తీసుకు రావలసిందనీ ......

"ఆపరేషన్ ప్రేమే చేస్తుంది. నేనూ ఉంటాను కాని నేను ముసలివాణ్ణవుతున్నాను" అన్నారు డాక్టరు పరమేశ్వరరావు.

ఆపరేషన్ జరిగింది .....

ధర్మవేణి అన్నది విజయ్‌తో ఏకాంతంగా : "ఏమండీ, ఒకవేళ నాకు చూపు రాకపోతే ఏమౌతుంది ? .... జీవితాన్ని గూర్చి నే నెప్పుడూ ఆలోచించలేదు, దాని విలువేమిటో అర్థం కాలేదు నాకు ఇన్నాళ్లూ ..... క్షణం వూరుకోకుండా, నా కిష్టం వచ్చినట్లు ఈ ప్రపంచమంతా నాదే అయినట్లూ ఆడుతూ పాడుతూ గడిపాను. నాలోని ప్రత్యేకతని చూపుకోవటానికి మీరు అవునన్నది కాదని ఎన్నిసార్లో మీకు కోపం తెప్పించాను. కాని మీరు లేకపోతే జీవితం లేదని చెప్పటానికే భగవంతుడు నాకీ శిక్ష వేశా డనిపిస్తోంది ! అజ్ఞానమే అయినా పొరపాట్లు చేసినప్పుడు, ఫలితం లేకుండా వూరికే పోదు ! .... ఇప్పుడు మీరే నా కన్నులకు వెలుగు కదా జీవితాంతమూ .... నాకు దృష్టి వస్తుందని మీకు నమ్మకమేనా ?"

విజయ్ ఆమె చేతిని తన రెండు చేతులమధ్యా గ్రహించి: "చూపు తప్పకుండా వస్తుంది ధర్మా !" అన్నాడు. అతనిలో పరివర్తన పరిపూర్ణ మయింది ఆ క్షణాన.

"డాక్టరు ఎంత మంచిదండీ ! ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతుంది. ఆమె ఎలా ఉంటుందో చూడాలని కుతూహలం .... అందుకైనా నాకు చూపు రావాలి.... లోకాన్నీ మిమ్మల్నీ మళ్లీ చూడాలని ఎంత ఆశగా ఉందనుకున్నారు!"

ప్రేమలతే కట్టు విప్పింది ....

ధర్మవేణికి ప్రపంచం మళ్లీ క్రొత్తగా దృశ్యం అయింది. క్రొత్తచూపుతో ప్రేమను గుర్తించింది ధర్మ.